క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హత్నూర(సంగారెడ్డి): హెల్త్ కార్డులు కలిగిన కార్మికులకు మంగళవారం హత్నూర మండలం సిరిపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశం తెలిపారు. సీఎస్సీ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్చ విజయలక్ష్మి నరేందర్, ఉప సర్పంచ్ వసంత వీరేశం, కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

మాధూరలో

మాధూర గ్రామంలో బుధవారం కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశం తెలిపారు.

ముగిసిన భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో న్యాక్ ఆధ్వర్యంలో లేబర్ కార్డ్ కలిగిన కార్మికులకు బర్ బెండింగ్ ట్రేడ్‌లో నిర్వహించిన 15 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ పొందిన వారందరికి (నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో టీ షర్ట్, హెల్మెట్, బ్యాగ్, బుక్, పెన్ పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన వసతి, స్కాలర్ షిప్ 4500, మహిళలకు సిజిఎస్ కుట్టుమిషన్లు అసిస్టెంట్ డైరెక్టర్ టీ రాము ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి తారాసింగ్, అపరంజి, కుమార్, శేకర్ సర్పంచ్ విజయ లక్ష్మి నరేందర్, ఉప సర్పంచ్ వసంత వీరేశం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి దోస్త్ ద్వారా ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పతంజలి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దోస్త్ ప్రవేశాల విషయంలో విద్యార్థులకు ఉచిత సహాయం చేయడానికి కళాశాల సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. బీఏ, ఇంగ్లీష్, తెలుగుమీడియం, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ, ఫిజికల్ సైన్స్‌లో మొత్తం 300 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. దోస్త్ మొదటి ఫేస్‌కి చివరి తేదీ 10-6-23లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నీలం మధు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు

పటాన్‌చెరు టౌన్: పటేల్ గూడా గ్రామం సిద్ధార్థ కాలనీ నాగేశ్వరరావుకు చెందిన శ్రీ లక్ష్మి ఫ్యాన్సీస్టోర్ విద్యుదాఘాతానికి గురైంది. ఈ సందర్భంగా ఆ స్టోర్‌ని సందర్శించి బాధితునికి ఎన్ఎంఆర్ యువసేన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని నీలం మధు ముదిరాజ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజవర్గ పరిధిలో సేవా కార్యక్రమాలు చేసేందుకు ఎన్ఎంఆర్ యువసేన ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మహేశ్, రాంకు సంతోష్, రమణ, పంతులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడికి సన్మానం



మడపతి సంగయ్యస్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: లింగాపూర్ గ్రామానికి చెందిన మడపతి సంగయ్యస్వామి వివిధ సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ అర్చకుడిగా ఎంపికై నంది అవార్డు అందుకున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం లింగాపూర్‌కు వచ్చిన సందర్భంగా సంగయ్యస్వామితోపాటు మరో అర్చకుడిని సర్పంచ్ సతీశ్, ఉప సర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ లక్ష్మి రాములు, పంచాయతీ కార్యదర్శి తానాజీ, గ్రామ పెద్దలు శంకర్, సంగప్ప, హన్మాండ్లు, తదితరులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

రేపు చేప మందు పంపిణీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాం పూర్ గ్రామంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు చేప మందు ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ ఆడెం మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దగ్గు, దమ్ము, ఎలర్జీ, ఉబ్బసం బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష ఎకరాలకు సాగునీరు

- రైతు సంక్షేమమే ముఖ్యం
- భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



పంప్‌హౌస్‌కు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ప్రతీ రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం లక్ష ఎకరాలకు సాగు నీరందించేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామ శివారులో ఈ నెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. శ్రీ సంఘమేశ్వర ప్రాజెక్టు లిఫ్టు ఇరిగేషన్ పంప్ హౌస్ పనులను మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు. సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గ రైతులకు సాగు, తాగు నీరందించడం కోసం శ్రీ సంఘమేశ్వర ప్రాజెక్టు లిఫ్టు ఇరిగేషన్ పంప్ హౌస్ ద్వారా సాగునీరు సరఫరా చేస్తారన్నారు. ప్రతీ రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఇరిగేషన్ ఈఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ శివకుమార్, చిన్నచల్మెడ సర్పంచ్ విజయభాస్కర్, ఎంపీటీసీ మంద రాజశేఖర్, ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ రవీందర్‌రావు, సర్వేయర్లు ప్రభాకర్, కోటేశ్వర్‌రావుతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి కుమార్, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణి నగర్ కాలనీకి చెందిన నరేందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకున్నారు. అతనికి మంజూరైన రెండున్నర లక్షల రూపాయల ఎల్ఓసీని మంగళవారం నరేందర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎంపీపీ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి



జహీరాబాద్ టౌన్: చెక్కు అందచేస్తున్న దృశ్యం

జహీరాబాద్ టౌన్: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి తోడ్పడుతుందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో రాచన్న పేటకు చెందిన అశోక్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం నామరవికిరణ్‌ను బాధితుడు సంప్రదించాడు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నామరవికిరణ్ రూ.60 వేలు మంజూరు చేయించి మంగళవారం కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు యాకూబ్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాద్లూర్ సమస్యలపై అధికారుల ఆరా



నీటి సమస్యను పరిశీలిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆదేశాలతో మండలంలోని కాద్లూర్‌లో నెలకొన్న మౌలిక సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రైతు దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కాద్లూర్ గ్రామానికి వచ్చిన సందర్భంలో గ్రామస్తులు గ్రామ సమస్యపై వినతిపత్రం అందించారు. సమస్యలపై ఆరా తీసేందుకు మంగళవారం ఎంపీఓ రియాజొద్దీన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఇంటింట తిరుగుతూ పలు సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. గ్రామంలోని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎస్సీ కాలనీలో బోరు వేయిస్తున్నామని, నూతనంగా ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఇందులో సర్పంచ్ యాదయ్య, కార్యదర్శులు కీర్తి, అజ్మీర్‌మియా, ప్రవీణ్, అశోక్, పోచయ్య తదితరులు ఉన్నారు.

మారెమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): 5వ వార్డులోని మారెమ్మ తల్లి దేవాలయంలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంగళవారం పూజలు నిర్వహించారు. గ్రామంలో మారెమ్మ తల్లి దేవాలయం వరకు వార్డు మహిళలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, వార్డు కౌన్సిలర్ పి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సమ్మెతో మూతపడ్డ రేషన్ షాపులు



అల్లాదుర్గంలో మూతపడ్డ రేషన్ షాపు

అల్లాదుర్గం(మెదక్): డీలర్లు సమస్యల సాధన కోసం సమ్మె చేపట్టడంతో అల్లాదుర్గం మండలంలో మూడు రోజులుగా రేషన్ షాపులు మూతపడ్డాయి. దీంతో నిరుపేదలు బియ్యం కోసం షాపుల వద్దకు వెళ్లడంతో మూతపడటంతో తిరిగి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ చెప్పారు.

సంగారెడ్డి మార్కెట్ నూతన కమిటీ చైర్మన్‌కు సన్మానం



ప్రభుగౌడ్‌ను సన్మానిస్తున్న టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మార్కెట్ నూతన కమిటీ చైర్మన్‌గా చిదురుప్ప ప్రభుగౌడ్‌ను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సహకరించిన రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రభు గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు నాగరాజ్ గౌడ్, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



మొబైల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం నాగ్‌ధర్‌కు చెందిన మన్నూరు మల్లేశం నెలక్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పోలీసుశాఖ సూచించిన పోర్టల్‌లో మీసేవ ద్వారా వివరాలను పొందుపర్చాడు. అనంతరం బాధితుని మొబైల్ ఆన్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంగళవారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి బాధితునికి మొబైల్ ఫోన్‌ను అందజేశారు. ఎవరైనా మొబైల్‌ను పోగొట్టుకుంటే మీసేవ ద్వారా సంబంధిత పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేశ్ పాల్గొన్నారు.

రైతుబంధు మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

- రైతు వేదికలలో బ్యాంకు ఖాతాల సేకరణ
- వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు



పెద్దచల్మెడ రైతు వేదికలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

మునిపల్లి(అందోల్): రైతు బంధు పథకం అమలులో వ్యవసాయ శాఖ వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతల బ్యాంకు ఖాతా, భూమి పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జీరాక్స్‌తో పాటు ఫోన్ నంబర్ల వివరాలు రైతు వేదికల కార్యాలయాల్లో దరఖాస్తులను తీసుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీ కొత్తగా పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు కూడా రైతు బంధు పథకం మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు గ్రామాల్లో చాటింపు వేయించారు. ఇంతకు ముందు ఖరీఫ్, రబీ సీజన్‌లో మంజూరైన రైతులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కొత్త పట్టాపాస్ బుక్కులు వచ్చిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతే కాకుండా ఇంతకు ముందు వ్యవసాయ భూమి పట్టాపాస్‌బుక్ ఉండి రైతు బంధుకోసం మంజూరు చేయించుకోని రైతులు కుడా చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఏ రోజుకు ఆ రోజు రైతు బంధు దరఖాస్తులను నమోదు చేసి సంబంధిత శాఖకు పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయాధికారులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి మరో సారి బ్యాంకు ఖాతాల నంబర్లు, బ్యాంకు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌కోడ్ తదితర వివరాలు సేకరించనున్నారు. పట్టాపాస్‌బుక్‌తో పాటు వివరాలు ఇచ్చిన రైతు బంధు మంజూరు కాని రైతుల బ్యాంకు అకౌంట్ నంబర్లు, ఆధార్ నంబర్ల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వాడకంలో ఉన్న బ్యాంకు ఖాతానంబర్లనే ఇవ్వాలని అన్నదాతలను అధికారులు కోరుతున్నారు.

రైతు బంధుతో ఎంతో ఉపయోగం



పంటల సాగుకు అవసరమైన సమయంలో ప్రభుత్వం రైతు బంధు మంజూరు చేస్తుండడంతో వారికి ఉపయోగంగా ఉందన్నారు. కష్టకాలంలో పంట దిగుబడి కోసం ఇబ్బంది పడకుండా ఉంటుంది.

- ప్రభుగౌడ్, రైతు, పిల్లోడి

నిబంధనల ప్రకారమే



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రైతుల నుంచి వ్యవసాయ భూమి పట్టాపాస్‌బుక్, బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు ద్వారా రైతుల బ్యాంకు అకౌంట్‌లో పెట్టుబడి సాయం జమ చేయడానికి వివరాలు తీసుకుంటున్నాం. కొత్తగా పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు ఎంత మంది దరఖాస్తు చేస్తారో అంత మందికి పెట్టుబడి సాయం మంజూరవుతుంది. దీనిలో భాగంగానే రైతుల నుంచి బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు సేకరిస్తారు.

-నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

యూనిఫామ్ దుస్తుల పరిశీలన



యూనిఫామ్ దుస్తులను పరిశీలిస్తున్న సీఎంఓ వెంకటేషం

కోహీర్(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల యూనిఫామ్ దుస్తులను ఈ నెల 10వ తేదీ లోపు సిద్ధం చేయాలని జిల్లా సీఎంఓ వెంకటేశం కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులతో కలిసి జహీరాబాద్‌లోని యూనిఫామ్ కుట్టు కేంద్రంలో దుస్తుల తయారీని పరిశీలించారు. సంబంధిత కుట్టు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారానికి చర్యలు

పటాన్‌చెరు: కాలనీల్లో మౌలిక వసతుల కల్పన,సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమీన్‌పూర్ పెద్ద చెరువు కట్టను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యూనుస్ తదితరలు పాల్గొన్నారు.

◆ పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహమేది?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వడంలేదని బీజేపీ రాష్ట్ర మాజీ మహిళామోర్చ ప్రధానకార్యదర్శి గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక సంక్షోభం తీవ్రంగా కనిపిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూతపడిన పరిశ్రమలను తెరిపించి, యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. లక్ష్మణ్ గౌడ్, శాములు యాదవ్, భూపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

◆ వాటర్ డిస్పెన్సరీ అందజేత

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వాటర్ డిస్పెన్సరీ అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణానికి చెందిన నిఖిలకు నార్మల్ డెలివరిలో మంగళవారం ఆడబిడ్డకు జన్మనిచింది. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుల కృషిని గుర్తించి నిఖిల శ్రీదర్ దంపతులు ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ డిస్పెన్సరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భరత్‌గౌడ్, సంగీత, శ్రీధర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్మారకభవన్ నిర్మాణ పనులు ప్రారంభం

నారాయణఖేడ్: జూకల్ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో దొడ్డి కొమురయ్య స్మారక కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ, గౌరవ అధ్యక్షుడు అంజన్న, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న అప్రోచ్‌రోడ్డు పనులు

నారాయణఖేడ్: సంజీవన్‌రావుపేట్ సమీపంలోని వంతెనకు ఇరుప్రక్కలా అప్రోచ్‌రోడ్డు పనులు రెండు రోజుల క్రితం ప్రారంభించారు. నారాయణఖేడ్, సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్ మండలాలతోపాటు కామారెడ్డి జిల్లా, కర్ణాటకలోని ఔరాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగుతుంటాయి. మూడేళ్లక్రితం వాగుపై భారీ వంతెనను నిర్మించారు. ఇరుప్రక్కలా రోడ్డు నిర్మించకపోవడంతో గోతులమయమై వర్షాకాలంలో వాహనాలు దిగబడుతున్నాయి. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో రాకపోకలు సాగించే వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు బీఆర్ఎస్ యువ నాయకులు రోషన్‌రెడ్డి పనులు పరిశీలించారు.

◆ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

కొండాపూర్(సంగారెడ్డి): సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని చెర్ల గోపులారానికి చెందిన నిర్మలప్రేమానందం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, మంత్రి హరీశ్ రావులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి దళిత మహిళ రిజర్వేషన్ కావడంతో తనకు అవకాశం కల్పించాలని కోరారు. తన భర్త ప్రేమానందంతో పాటు తను కూడా బీఆర్ఎస్ అభివద్ధికి, బలోపేతానికి కృషి చేస్తున్నానన్నారు.

◆ కొనసాగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నారాయణఖేడ్: చల్లగిద్ద తండాలో త్రయాహ్నిక జగదాంబ, సేవాలాల్, రాంరావుమహారాజ్, నంది, శిఖర, ధ్వజమూర్తి యంత్రస్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం కొనసాగాయి. మంటపస్థిత అవాహిత దేవత పూజాధికం, హోమాదివాసం, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, ఫలపుష్పాదివాసం, నైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిషత్తు అధ్యక్షురాలు కర్ర చాందీబాయి చౌహాన్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, సర్పంచ్ సుశీల రమేష్‌చౌహాన్, రాణాప్రతాప్ సింగ్, విశ్వనాథ్, చోటిరామ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

◆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమను లాకౌట్ చేసిందని, నిబంధనలను పట్టించుకోని పరిశ్రమపై అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులకు మంగళవారం ఆయన మద్దతు పలికారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ హార్టెక్స్ పరిశ్రమ యాజమాన్యం స్పందించి లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

◆ శ్రీ భవాని భువనేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని శ్రీ భవాని భువనేశ్వరి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. మహిళలు లలిత సహస్ర పారాయణం చదివారు. ఆలయంలో మహా హారతి నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో చేశారు.

◆ పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

సంగారెడ్డి అర్బన్: పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద రెండు రోజులుగా నేషనల్ హైవే 65వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై నిత్యం పెద్ద ఎత్తున వాహనాలు తిరుగుతూ ఉంటాయి ఏ వైపు నుంచి ఏ వాహనం వస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ని బాగు చేయించాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

మరమ్మతుల కమిటీ నియామకం

కోహీర్(జహీరాబాద్): బడంపేట శ్రీ రాచన్న స్వామి ఆలయ రెన్యేవేషన్ కమిటీ నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆలయ రెన్యేవేషన్ కమిటీ పదవి కాలం ముగియడంతో కొత్త కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 15 తేదీ లోపు తమకు గానీ లేదా కమిషనర్ దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



జోగిపేట(అందోల్): ఈనెల 10వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ తెలిపారు. రాజీయే రాజమార్గమని, క్షణికావేశంలో జరిగిన ఘర్షణలో నమోదైన కేసులను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.